క్లుప్తంగా

ఆయుర్వేద మొక్కలతో ఆరోగ్యం



వర్క్‌షాపులో పాల్గొన్న విద్యార్థులు

హుస్నాబాద్: ఆయుర్వేద మొక్కలపై అవగాహన ఉంటే వ్యాధులు నివారించవచ్చని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భిక్షపతి సూచించారు. బాటనీ విభాగం, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం వినాయకపూజకు వాడే మొక్కలపై వర్క్‌షాపు నిర్వహించారు. వినాయకపూజలో వాడే ముఖ్యమైన 21 రకాల మొక్కల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఆయుర్వేద మొక్కలకు చాలా ప్రాముఖ్యం ఉందన్నారు. బాటనీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బాలరాజు, అధ్యాపకులు ఇందిరా నాయనదేవి, అనిల్, చంద్రమౌళి, షబీ ఫాతిమా తదితరులు ఉన్నారు.

చెత్త విభజనపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న మల్లికార్జున్

హుస్నాబాద్: చెత్తను తడి, పొడి, హానికరమైన చెత్తగా వేరుచేసి మున్సిపల్ వాహన సిబ్బందికి అందించాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ సూచించారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా బసిల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సీవీ రామన్ పాఠశాల విద్యార్థులకు చెత్త విభజనపై డీఆర్‌సీసీ వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలన్నారు. స్టీల్ టిఫిన్ బాక్స్, వాటర్ బాటిళ్లనే వాడాలని, మార్కెట్‌కు వెళ్లేటప్పుడు జ్యూట్ బాగులనే వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, పర్యావరణ అధికారి రవి కుమార్, ఫౌండేషన్ సూపర్‌వైజర్లు భాను, రాజు, నవీన్, అభిషేక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా



నాయకులు, అధికారులతో ఐలయ్య

జగదేవ్‌పూర్(గజ్వేల్): కొండపోచమ్మ ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యయాదవ్ చెప్పారు. కొండపోచమ్మ అమ్మవారిని డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డితో కలిసి మంగళవారం ఆయన దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం బీర్ల ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన తాగునీటి శుద్ధి కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రవికుమార్, నాయకులు నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, రమేశ్, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

సిద్దిపేటజోన్: సీజనల్ వ్యాధుల నేపథ్యంలో మున్సిపల్, వైద్యశాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకునేలా ప్రజలను వివరించాలన్నారు. ప్రతి శుక్రవారం తప్పనిసరి డ్రై డే నిర్వహించాలని ఆదేశించారు. డెంగీ కేసులు ఉంటే అప్రమత్తంగా ఉండాలని, సమీప ప్రాంతంలో ప్రజలను అలెర్ట్ చేయాలని సూచించారు. సమావేశంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, డాక్టర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు అమలు చేయండి

గజ్వేల్‌రూరల్/చేర్యాల(సిద్దిపేట)/హుస్నాబాద్‌రూరల్/హుస్నాబాద్/చిన్నకోడూరు(సిద్దిపేట): ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని బీజేపీ నాయకులు ఆయా మండలాల తహసీల్దార్లకు మంగళవారం వినతిపత్రాలు అందజేశారు. వారు మాట్లాడుతూ రూ.2 లక్షల రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు, రూ.4 వేల పెన్షన్, రూ.2,500 జీవనభృతి లాంటి హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విఫలమైందన్నారు. కాంగ్రెస్ నాయకులు మాయమాటలతో ప్రజలను మోసం చేస్తూ పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. గ్యారంటీలను అర్హులకే అందేలా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమాలలో పరశురాములు, నాగరాజు, సంతోష్‌కుమార్, రాంప్రసాద్, దీపిక, వెంకటేశ్, సురేశ్, మహేందర్‌రెడ్డి, రాందాసు, సిద్ధారెడ్డి, బాలరాజు, సత్యవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



గజ్వేల్‌రూరల్: కోర్టు ఆవరణలో మట్టి గణపయ్యలను పంపిణీ చేస్తున్న న్యాయమూర్తి స్వాతి



మిరుదొడ్డి(దుబ్బాక): మట్టి విగ్రహాలను తయారు చేస్తున్న విద్యార్థులు



మిరుదొడ్డి(దుబ్బాక): చిట్టిచేతులు రూపొందించిన గణేశుడి విగ్రహాలు

మట్టి వినాయక.. పర్యావరణ రక్షక

వినాయక చవితి సందడి మొదలైంది. వేడుకల సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మంగళవారం మట్టి వినాయక ప్రతిమల ఆవశ్యకత గురించి అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు విద్యార్థులతో వినాయక విగ్రహాలను తయారు చేయించారు. వారి చిట్టిచేతులతో వివిధ రూపాలలో గణేశుడి ప్రతిమలను రూపొందించి పంపిణీ చేయించారు. మట్టి గణపతి విగ్రహాలను వినియోగించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని కోరారు.



సంగునూరు(సిద్దిపేట): మట్టి ప్రతిమలు రూపొందించిన మోడల్ స్కూల్ విద్యార్థులతో ఉపాధ్యాయులు



సిద్దిపేటలో ప్రతిమలను పంపిణీ చేస్తున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్



దుబ్బాక డిగ్రీ కళాశాలలో గణపతి ప్రతిమలను పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్ భవాని



తొగుట(దుబ్బాక): కాన్వెంట్ పాఠశాలలో గణేశుడి విగ్రహాలను పంపిణీ చేస్తున్న హెచ్ఎం మధు



హుస్నాబాద్‌రూరల్: పోట్లపల్లిలో గణపతి విగ్రహాల పంపిణీ



బెజ్జంకి మోడల్ స్కూల్‌లో..



సిద్దిపేటజోన్: వినాయక విగ్రహం అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్

విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవు

అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్



తిమ్మాపూర్‌లో పర్యటిస్తున్న అదనపు కలెక్టర్

జగదేవ్‌పూర్(గజ్వేల్): గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ హెచ్చరించారు. మండలంలోని తిమ్మాపూర్ గ్రామాన్ని మంగళవారం ఆమె సందర్శించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. అనంతరం ఇటీవల డెంగీతో మృతి చెందిన వారి వివరాలను వైద్యాధికారి రాజశేఖర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గరీమా మాట్లాడుతూ గ్రామాల్లో సీజనల్ వ్యాధులు, వైరల్ జ్వరాలు విజృంభిస్తున్న తరుణంలో వైద్య, శానిటేషన్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలు వైద్యాధికారుల వద్దే చికిత్స చేయించుకోవాలని సూచించారు. ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని తగ్గించాలని, వాటిని విక్రయించే వారికి జరిమానా విధించాలని అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శి, శానిటేషన్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె వెంట తహసీల్దార్ నిర్మల, ఎంపీడీఓ రాంరెడ్డి, వైద్యాధికారులు ఉన్నారు.

కేజీబీవీ ఎస్ఓకు షోకాజ్ నోటీస్

స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని గరీమా అగర్వాల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. 11 మంది ఉపాధ్యాయులకు గాను 8 మంది సెలవులో ఉంటంపై మండిపడ్డారు. డీఈఓ శ్రీనివాస్‌రెడ్డికి ఫోన్‌చేసి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమయానికి అల్పాహారం, భోజనం అందించడం లేదంటూ విద్యార్థులు ఆమెకు చెప్పటంతో ఎస్ఓ ప్రవంతికి షోకాజ్ నోటీసును జారీ చేశారు.

పెద్దగుండవెల్లిలో డ్రై డే

దుబ్బాకరూరల్: మండలంలోని పెద్దగుండవెల్లి గ్రామంలో మంగళవారం డ్రైడే నిర్వహించారు. పారిశుద్ధ్య కార్మికులు డ్రైనేజీలను శుభ్రం చేశారు. చెత్త చెదారాన్ని ట్రాక్టర్‌లో తరలించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి మురళి మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న తరుణంలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా ఎప్పటి కప్పుడు శుభ్రపర్చుకోవాలన్నారు. నీరు నిలిచిపోతే దోమలు వ్యాప్తిచెంది జ్వరాలు వచ్చే అవకాశం ఉందన్నారు.

కేబుల్ వైర్ల తొలగింపు సరికాదు



ఎస్ఈ చంద్రమోహన్‌కు వినతిపత్రం అందజేస్తున్న కేబుల్ ఆపరేటర్లు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలో విద్యుత్ స్తంభాలకు కట్టిన కేబుల్ వైర్లను విద్యుత్ అధికారులు తొలగించడం బాధాకరమని కేబుల్ ఆపరేటర్ల అసోసియేషన్ నాయకులు వాపోయారు. కేబుల్ వైర్లను తొలగించవద్దని కోరుతూ విద్యుత్‌శాఖ ఎస్ఈ చంద్రమోహన్‌కు మంగళవారం వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమకు పది రోజులు సమయం ఇస్తే తామే స్వచ్ఛందంగా తొలగిస్తామన్నారు. ఇలా ఒక్కసారిగా తొలగిస్తే తీవ్రంగా నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు రమేశ్, చందర్ యాదవ్, బాబు, శ్రీనివాస్‌గౌడ్, సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అరికట్టాలి

కొండపాక(గజ్వేల్)/సిద్దిపేటరూరల్/హుస్నాబాద్ రూరల్: పోలీసు అధికారులు పలు పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కొండపాక మోడల్ స్కూల్లో జరిగిన కార్యక్రమంలో తొగుట సీఐ లతీఫ్ మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని చెప్పారు. సైబర్ నేరాల నియంత్రణ, గుడ్ టచ్ బాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. మైనర్లు డ్రైవింగ్ చేస్తే తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాల్య వివాహాలను ప్రోత్సహించే వారిపై కేసులు నమోదు చేస్తామంటూ హెచ్చరించారు. ఎస్ఐ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ యజ్ఞశ్రీ,, షీ టీం పోలీసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని రాఘవాపూర్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఎస్ఐ రాజేశ్ మాట్లాడారు. మహిళల రక్షణ కోసం ఉన్న చట్టాలు, సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు, షీ టీమ్ బృందం మమత తదితరులు పాల్గొన్నారు. హుస్నాబాద్‌రూరల్ మండలంలోని జిల్లెలగడ్డలో ఏఎస్ఐ సదయ్య మాట్లాడారు. గ్రామాలకు కొత్తవారు వస్తే సమాచారం ఇవ్వాలన్నారు. గంజాయి, డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ ప్రశాంతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

సీఐ లతీఫ్



సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన వారిని సన్మానించిన సీఐ లతీఫ్, ఎస్ఐ రవికాంత్‌రావు

తొగుట(దుబ్బాక): సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో నేరాలు తగ్గాయని సీఐ ఎస్‌కే లతీఫ్ అన్నారు. మండలంలోని వెంకట్రావుపేటలో సోలార్ సిస్టంతో ఏర్పాటు చేసిన నాలుగు సీసీ కెమెరాలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒక్క సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానమన్నారు. సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వినాయకచవితి వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని వినాయక మండపాల వద్ద, నిమజ్జనం సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. మద్యం సేవించి ఉత్సవాల్లో పాల్గొనవద్దని యువకులకు సూచించారు. గ్రామాల్లో అనుమానితులు కనిపిస్తే 100కు డయల్ చేయాలని కోరారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన గ్రామస్తులు రఘుపతిరావు, కంకనాల నర్సింహులు, పెంటోజీ, అంజయ్యగౌడ్, రాజు, మిద్దె సంతోష్, సూరజ్, గ్రామ పోలీస్ అధికారి భానును సీఐ సన్మానించారు. కార్యక్రమంలో ఎస్ఐ రవికాంత్ రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామాల ప్రజలు సహకరించాలి

మిరుదొడ్డి(దుబ్బాక): గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు అందరూ సహకరించాలని, నేరాల నియంత్రణకు ఎంతో దోహదం చేస్తాయని ఎస్ఐ సమత సూచించారు. మండల పరిధిలోని ధర్మారంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేసిన రంగనబోయిన యాదగిరిని మంగళవారం ఆమె శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేరాలు జరగకుండా గ్రామాల్లో గట్టి నిఘా ఏర్పాటు చేశామన్నారు.



యాదగిరిని సన్మానించిన ఎస్ఐ సమత

ఆ అధికారులపై చర్యలు తీసుకోవాలి

సీపీఎం జిల్లా నేత యాదగిరి



రైతులతో కలిసి నిరసన తెలుపుతున్న యాదగిరి

మద్దూరు(హుస్నాబాద్): కొన్ని యూరియా బస్తాలను అధికార పార్టీ నాయకులకు అందిస్తున్న సొసైటీ అధికారులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఆలేటి యాదగిరి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సొసైటీ క్యాష్ కౌంటర్ వద్ద రైతులతో కలిసి మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 25న రేబర్తి సొసైటీకి 560 బస్తాల యూరియా రాగా.. అందులో 442 బస్తాలు మాత్రమే రైతులకు అందించినట్లు రికార్డులో రాసి ఉందని, మిగిలిన 118 బస్తాల గురించి ప్రశ్నించగా కాంగ్రెస్ పార్టీ నాయకుడు చేర్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కామిడి జీవన్‌రెడ్డి, వ్యవసాయ అధికారులకు ఇచ్చామని సొసైటీ సిబ్బంది తెలిపారని వాపోయారు. రైతుకు రెండు బస్తాలు అందిస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులకు మాత్రం ఎక్కువ బస్తాలు ఇవ్వడంపై ఆయన మండిపడ్డారు. ఉన్నతాధికారులు విచారణ చేపట్టి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలిన డిమాండ్ చేశారు.

టోకెన్ ఒక చోట.. బస్తా మరోచోట

మద్దూరు(హుస్నాబాద్): రైతులకు ఒకచోట టోకెన్ ఇచ్చి మరోచోట యూరియా బస్తాలు అందించడంతో రైతుల బాధలు వర్ణతీతంగా ఉన్నాయి. మండలంలోని లద్నూరు క్లస్టర్ పరిధిలోని 5 గ్రామాలకు మంగళవారం వ్యవసాయ అధికారులు యూరియా బస్తాలు అందిస్తామని తెలపడంతో రైతులు ఉదయం నుంచి టోకెన్‌ల కోసం క్యూలో నిలిచారు. లద్నూరులో టోకెన్‌లు తీసుకున్న రైతులు మర్మాముల గ్రామంలోని ఆగ్రోస్ ఫర్టిలైజర్ షాపు వద్ద యూరియా బస్తాలు తీసుకున్నారు. దీంతో రైతులు వ్యవసాయ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

విఫలమైన ఎంపీ రఘునందన్‌రావు

సిద్దిపేటజోన్: కేంద్రం నుంచి యూరియా తెచ్చే విషయంలో ఎంపీగా రఘునందన్‌రావు విఫలమయ్యారని నియోజకవర్గ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు వేణుగోపాల్‌రెడ్డి, సారయ్య, సోమిరెడ్డి, రవీందర్‌రెడ్డి ఆరోపించారు. రైతులు యూరియా కోసం పడిగాపులు కాస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేతులెత్తేశాయని విమర్శించారు. పీఏసీఎస్ చైర్మన్ రమేశ్, కౌన్సిలర్ అరవింద్‌రెడ్డి, రాములు, ఆంజనేయులు, యాదగిరి, రాము, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



మద్దూరు(హుస్నాబాద్): పోలీసుల పహారాతో రైతులకు టోకెన్లు ఇస్తున్న అధికారులు

రైతుల ఆందోళన

తొగుట(దుబ్బాక): మండల కేంద్రంలోని ఆగ్రోస్ కేంద్రానికి యూరియా లారీ వస్తుందన్న సమాచారంతో రైతులు అక్కడికి చేరుకున్నారు. కానీ దుకాణం మూసివేసి ఉండటంతో రైతులు ఏఓకు ఫోన్‌చేసి యూరియా కోసం వాకబు చేశారు. యూరియా లారీ వస్తున్నట్టు తనకు సమాచారం లేదని చెప్పడంతో ఆగ్రహానికి గురైన రైతులు రోడ్డుపై బైఠాయించారు. సీఐ లతీఫ్, ఎస్ఐ రవి కాంత్‌రావు అక్కడికి చేరుకుని రైతులను సముదాయించి ఆందోళన విరమింపజేశారు.

రైతుల అవస్థలు వర్ణనాతీతం

బెజ్జంకి(సిద్దిపేట): యూరియా లభించక రైతులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయని సీపీఐ మండల కార్యదర్శి బొనగిరి రూపేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. బెజ్జంకిలో సోమవారం యూరియా కోసం వచ్చిన రైతులతో కలిసి మాట్లాడారు. యూరియాపై సబ్సిడీ తగ్గించేందుకే కేంద్ర ప్రభుత్వం యూరియా ఇవ్వడంలేదని ఆరోపించారు. సరిపడా యూరియా సరఫరా చేయపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

రెచ్చగొట్టేలా పోస్టులు పెట్టొద్దు

ఏసీపీ సదానందం



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ సదానందం

చేర్యాల(సిద్దిపేట): పండుగల నేపథ్యంలో కుల, మతాలను రెచ్చగొట్టేలా పోస్టులు పెడితే చర్యలు తప్పవని ఏసీపీ సదానందం హెచ్చరించారు. వినాయకచవితి, మిలాద్ ఉన్ నబీ పండుగలను పురస్కరించుకుని స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో మంగళవారం పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సదర్బంగా ఆయన మాట్లాడుతూ పండుగలను ప్రశాంత వాతావరణలో నిర్వహించుకోవాలన్నారు. హైదరాబాదులో మిలాద్ ఉన్ నబీ జరుపుకున్న రోజునే చేర్యాలలోను జరుపుకోవాలని సూచించారు. ఏదైనా అవాంఛనీయ ఘటన జరిగితే సమాచారం ఇవ్వాలని కోరారు. సోషల్ మీడియాలో ఇతరుల మనోభావాలు దెబ్బతీసేలా ఎవరైనా పోస్టులు పెడితే ఊరుకోబోమని చెప్పారు. సమావేశంలో సీఐ శ్రీను, ఎస్ఐ నవీన్, వీహెచ్‌పీ నేతలు సంపత్, జగదీశ్వర్, తిరుపతిరెడ్డి, సంజీవులు, సిద్దులు, రాకేశ్, ముస్లిం పెద్దలు ఆదిల్, బడేమియా, వాహీద్, తాహెర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **రాష్ట్రంలో బలంగా కాంగ్రెస్**

దుబ్బాక: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలంగా తయారైందని పీసీసీ ఉపాధ్యక్షుడు, కాంగ్రెస్ డీలిమిటేషన్ సభ్యుడు డాక్టర్ పన్యాల శ్రావణ్‌కుమార్ రెడ్డి అన్నారు. పీవీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో రెండు వేల మట్టి గణపతి ప్రతిమలను మంగళవారం ఆయన పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ రేవంత్ సర్కార్ పాలనతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. పీవీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో సంజీవరెడ్డి, రాజిరెడ్డి, మల్లేశం, ఐలయ్య, సాయిగౌడ్, కాంతమ్మ పాల్గొన్నారు.

◆ **అంకితభావంతో విధులు నిర్వహిస్తేనే గుర్తింపు**

మద్దూరు(హుస్నాబాద్): పోలీసు ఉన్నతాధికారులు విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు వస్తుందని ఏసీపీ సదానందం అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మద్దూరు పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలు, రికార్డులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వారి సమస్యను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో చేర్యాల సీఐ శ్రీను, ఎస్ఐ షేక్ మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

◆ **కేజ్‌వీల్స్‌తో ట్రాక్టర్లు నడపొద్దు**

దౌల్తాబాద్(దుబ్బాక): కేజ్‌వీల్స్ అమర్చిన ట్రాక్టర్లను రోడ్డుపై నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ అరుణ్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రోడ్లను ధ్వంసం చేసి, ప్రజలకు ఇబ్బంది కలిగించవద్దన్నారు. ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానులు పోలీసుల సూచనలు పాటించాలని కోరారు.

◆ **డెంగీ బాధితులను ఆదుకుంటాం**

జగదేవ్‌పూర్(గజ్వేల్): డెంగీతో మృతి చెందిన బాధిత కుటుంబాలను ఆదుకుంటామని డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి చెప్పారు. మండల పరిధిలోని తిమ్మాపూర్ గ్రామంలో ఇటీవల డెంగీతో మృతి చెందిన శ్రవణ్‌కుమార్, కొంతం మహేశ్ కుటుంబాలను మంగళవారం ఆయన ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నేత రవీందర్‌రెడ్డితో కలిసి పరామర్శించారు.

◆ **నైపుణ్యాన్ని చాటితేనే అవకాశాలు**

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు తమలో ఉన్న నైపుణ్యాన్ని చాటినపుడే అవకాశాలు మెండుగా లభిస్తాయని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నిఖత్ అంజుమ్ అన్నారు. కళాశాలలో రెండు వారాలుగా నిర్వహించిన సాఫ్ట్‌స్కిల్స్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ కోర్స్‌లో శిక్షణ పొందిన విద్యార్థులకు మంగళవారం ధ్రువపత్రాలు అందజేశారు. టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ డాక్టర్ కవిత, మ్యాజిక్ బస్ ఇండియా ప్రతినిధులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

◆ **కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం**

చిన్నకోడూరు(సిద్దిపేట): గ్రామాల్లో అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యపడుతుందని ఆ పార్టీ నాయకులు అన్నారు. చిన్నకోడూరులో ఆ పార్టీ మండల అధ్యక్షుడు మీసం మహేందర్, జిల్లా నాయకులు పరశురాములు, రాజేశ్, భూపతి మాట్లాడారు. అభివృద్ధికి కాంగ్రెస్ నిధులు ఇస్తే ఎమ్మెల్యే హరీశ్‌రావుకు క్షీరాభిషేకాలు చేయడం సిగ్గుచేటన్నారు. నాయకులు ప్రశాంత్, జయంత్, శంకర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

◆ **ప్రమోషన్‌లు కల్పించడం హర్షణీయం**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): భాషా పండిత్‌లకు ప్రమోషన్‌లు కల్పించడం హర్షణీయమని, సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని పండిత్ పరిషత్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్ రవూఫ్, లింగం అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో వారు మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్లా, ప్రధాన కార్యదర్శి కాంతి కృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు.

◆ **టీవీల అందజేత**

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని రామంచ ప్రాథమిక పాఠశాలకు గ్రామానికి చెందిన ఎర్ర నవీన్ మంగళవారం రెండు టీవీలు అందజేశారు. ఈ సందర్భంగా కాంప్లెక్స్ హెచ్ఎం లక్ష్మయ్య మాట్లాడుతూ పేదలకు సేవ చేయడంలోనే నిజమైన తృప్తి లభిస్తుందన్నారు. విద్యార్థులకు సేవ చేయడం ప్రతి ఒక్కరు బాధ్యతగా గుర్తించాలని సూచించారు. రూ.35 వేల విలువగల టీవీలు అందజేసిన నవీన్‌ను అభినందించారు. హెచ్ఎం అబ్దుల్ షరీఫ్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

◆ **ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలతో ఉపాధి**

బెజ్జంకి(సిద్దిపేట): ఇందిరమ్మ ఇళ్ల పథకంతో పేదలకు సొంతింటి కల నెరవేరడంతోపాటు వేలాది మందికి ఉపాధి లభిస్తుందని మాజీ ఎంపీపీ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్ అన్నారు. మండలంలో పైలెట్ ప్రాజెక్టుగా తీసుకున్న వీరాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను మంగళవారం పరిశీలించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో 502 ఇళ్లు మంజూరు కాగా 400 ఇళ్లు వివిధ దశలలో ఉన్నాయన్నారు. ప్రతి గ్రామంలో మొదట పూర్తి చేసిన వారికి రూ.10 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రత్నాకర్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సంపత్‌రెడ్డి శ్రీకాంత్, సందీప్, సంతోష్, తిరుపతి, చెన్నారెడ్డి, సుధీర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

◆ **కేజీబీవీలో దరఖాస్తుల ఆహ్వానం**

రేగోడ్(మెదక్): మండల కేంద్రంలోని కేజీబీవీలో బోధనతో పాటు ఖాళీలుగా ఉన్న పోస్టులకు అర్హత కలిగిన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని కేజీబీవీ కళాశాల ప్రిన్సిపాల్ స్వయంప్రభ మంగళవారం తెలిపారు. ఒక అతిథి అధ్యాపకులు (పీజీ సీఆర్‌టీ), ఫిజిక్స్ 1, కెమిస్ట్రీ 1 పోస్టులకు గ్రాడ్యుయేట్, బీఈడీతో పాటు సంబంధిత సబ్జెక్టు బోధనలో అనుభవం ఉండాలని తెలిపారు.